
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
గురువారం 20 నవంబరు 2025

ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు

జిల్లా	ప్రాంతం	ఉష్ణోగ్రత (డిగ్రీల్లో)
వికారాబాద్	మర్పల్లి	10.8
రంగారెడ్డి	మంగలపల్లి	10.6
మేడ్చల్	ఘట్‌కేసర్	11.8



మాలల రణభేరిని జయప్రదం చేయాలి

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య



సమావేశంలో మాట్లాడుతున్న చెన్నయ్య

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్‌లో ఈనెల 23న నిర్వహించతలపెట్టిన మాలల రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య పిలుపునిచ్చారు. షాద్‌నగర్‌లో బుధవారం నిర్వహించిన మాల మహానాడు సమావేశానికి చెన్నయ్య హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, మాలల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించి మాలలకే అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మాలల రణభేరికి అధిక సంఖ్యలో మాలలు తరలివచ్చి, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎల్లంపల్లికి చెందిన రాజశేఖర్ హత్యను ఖండించారు. దుండగులను కఠినంగా శిక్షించి, అతడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బూర్గుల వెంకటేశ్వర్లు, మహేష్‌మాల, సంకం నర్సింహులు, శేఖర్, మల్లేష్, పెంటయ్య, వినోద్, శ్రీను, అశోక్, అంజయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం పక్కదారి పడుతోంది. గృహాల మంజూరులో అవకతవకలు వెలుగు చూస్తున్నాయి. నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతోంది. కొందరు అధికారుల నిర్వాకంతో అసలు లబ్ధిదారులు ఇందిరమ్మ ఇంటిని పొందలేకపోతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇల్లు ఒకరి పేరు మీద మంజూరైతే.. పేరు మార్చి మరొకరికి కేటాయింపు జరిగింది. అలాగే వ్యవసాయ పొలంలో ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవద్దని నిబంధన ఉంది. కానీ ఓ మహిళ తన కుమారుడికి చెందిన వ్యవసాయ పొలంలో ఇంటి నిర్మాణ పనులు చేపట్టింది. అంతేకాకుండా పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఆమె ఖాతాలో రూ.2లక్షలు జమ చేశారు. ఇలాంటి ఉదంతాలు వెలుగులోకి వస్తున్నా... ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు గుప్పుమంటున్నాయి.



వ్యవసాయ పొలంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం

ఇందిరమ్మ.. ఇదేందమ్మో!

ఇళ్ల మంజూరులో అవకతవకలు

పేరొకరిది.. ఇల్లు కేటాయింపు మరొకరికి.. వ్యవసాయ పొలంలో ఇంటి నిర్మాణం

వెబ్‌సైట్‌లో తప్పుడు పేర్ల నమోదు.. పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది నిర్వాకం

కొందుర్గు మండలంలో ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న అక్రమాలు



పావని పేరు మీద వచ్చిన ఇందిరమ్మ ఇంటిని ఇతరులు నిర్మించుకుంటున్న దృశ్యం

కొందుర్గు, 19 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలు.. ఆర్థికంగా ఇల్లు కట్టుకునే స్థోమత లేనివారు.. తమ సొంతింటి కలను నెరవేర్చుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయహస్తం పథకం కింద ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. కానీ ఈ పథకం కొందరి విషయంలో పక్కదారి పడుతుంది. విశాలమైన వ్యవసాయ స్థలంలో ఓ మహిళా లబ్ధిదారు నిబంధనలకు విరుద్ధంగా ఎంచక్కా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టి ప్రభుత్వ నుంచి బిల్లులు పొందుతుంది. ఇదిలా ఉంటే, ఇందిరమ్మ ఇంటి కోసం దివ్యాంగుడి భార్యకు ఇళ్ల మంజూరైతే.. ఆమెకు సమాచారం ఇవ్వకుండా మరొకరికి దానిని కేటాయిస్తూ ఏకంగా

మిగతా 8వ పేజీలో...

ఇల్లు మంజూరైన విషయమే తెలియదు



ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాం. కానీ ఇల్లు మంజూరైన విషయం మాత్రం మాకు తెలియదు. తర్వాత ఒకరిద్దరు వచ్చి నా ఆధార్ కార్డు ఇవ్వమని అడిగారు. ఎందుకని అడిగితే రెండో జాబితాలో ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేస్తామని చెప్పారు. మళ్లీ కొద్దిసేపటికి వచ్చి నీ బ్యాంకు ఖాతాలో ఇందిరమ్మ ఇంటికి సంబంధించి పేరు తప్పుపడటంతో నీ బ్యాంకు ఖాతాలో లక్ష రూపాయలు జమ య్యాయి. వాటిని తిరిగి మాకు ఇవ్వాలని అడిగారు. నేను, మా ఆయన బ్యాంకుకు వెళ్లి తమ ఖాతా వివరాల గురించి అడిగాం. ఎకౌంట్‌లో లక్ష రూపాయలు జమయ్యాయని బ్యాంకు సార్లు చెప్పారు. కానీ ఇల్లు మంజూరైన విషయాన్ని అధికారులు మాకు ఎందుకు చెప్పలేదో మాకే అర్థం కాలేదు. సారూ.. మాకు మీరైన న్యాయం చేయాలి.

- పావని, ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు, చెరుకుపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

- జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం
- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహ నిర్మూలనలో జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలుపుదామని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బాల్య వివాహ నిర్మూలన, జిల్లా శిశు సంరక్షణ సమితి (డీసీపీఎస్) ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన బాల్య వివాహ ముక్త్ భారత్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగితేనే ఫలితాలు ఉంటాయన్నారు. గ్రామస్థాయి వరకు బాలల రక్షణ చట్టంపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. గ్రామ, మండల స్థాయి చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను బలోపేతం చేయాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనలో పోలీస్, రెవెన్యూ, ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, వైద్య ఆరోగ్యం, విద్య, కార్మిక, సామాజిక సంక్షేమ శాఖలు తమ బాధ్యతలను చురుగ్గా నిర్వహించాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు, స్వయం సహాయక మహిళా సమాఖ్యలు, ఎన్జీవోలు, చైల్డ్‌లైన్ (1098) సంఘాల పర్యవేక్షణ నిరంతరం ఉండాలన్నారు.

సాధారణ, వ్యయ పరిశీలకుల నియామకం



వికారాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామ పంచాయతీ ఎన్నికలకు జిల్లాల వారీగా సాధారణ, వ్యయ పరిశీలకులను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. వికారాబాద్ జిల్లా సాధారణ పరిశీలకులుగా హార్టికల్చర్ అండ్ సెరికల్చర్ డైరెక్టర్ షేక్ యాస్మీన్ భాష, వ్యయ పరిశీలకులుగా మహబూబ్‌నగర్ జిల్లా ఆడిట్ అధికారి ఎం.రమేష్‌కుమార్‌ను నియమించారు. రంగారెడ్డి జిల్లా సాధారణ పరిశీలకుడిగా ఇరిగేషన్ అండ్ క్యాచ్‌మెంట్ ఏరియా డెవలప్‌మెంట్ ప్రత్యేక కార్యదర్శి పాటిల్ ప్రశాంత్ జీవన్, వ్యయ పరిశీలకుడిగా రాష్ట్ర ఆడిట్ డైరెక్టరేట్‌లో జిల్లా అడిట్ అధికారిగా పనిచేస్తున్న నార్యలను నియమించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియను సాధారణ పరిశీలకులు పరిశీలించనుండగా, ఎన్నికల్లో అభ్యర్థులు చేసే ఖర్చులను వ్యయ పరిశీలకులు పరిశీలిస్తారు.

జీతం ఇక్కడ.. ఉద్యోగం అక్కడ!

- విద్యాశాఖలో కొనసాగుతున్న అక్రమ డిప్యూటేషన్ల పరంపర
- చౌదరిగూడ మండలంలో అడ్డదారిలో ఇద్దరు టీచర్లకు ఆర్డర్లు



లాల్‌పహాడ్‌లో టీచర్ల కోసం ధర్నా చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

చౌదరిగూడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖల్లో అక్రమ డిప్యూటేషన్ల పరంపర కొనసాగుతోంది. ప్రభుత్వం నియమించిన చోట టీచర్లు పని చేయడం లేదు. తమకు నచ్చిన చోటుకి టీచర్లు అక్రమంగా డిప్యూటేషన్ ఆర్డర్‌లు తీసుకుని జీతం ఇక్కడ.. ఉద్యోగం అక్కడ కొనసాగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయించిన ప్రాంతాల్లోనే పనిచేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారులు అవేమి పట్టించుకోవడం లేదు. రాజకీయ పలుకుబడి, ఒత్తిడిలు, పలు సంఘాల పెత్తనంతో యథేచ్ఛగా అక్రమ డిప్యుటేషన్‌లు తెచ్చుకుంటున్నారు. పల్లెలు, గిరిజన తండాలో పనిచేయడం ఇష్టం లేక పట్టణాలకు డిప్యూటేషన్‌పై టీచర్లు వెళ్తున్నారు. దీంతో మారుమూల ప్రాంతాల్లో పాఠశాలలు మూతపడే పరిస్థితి నెలకొంది. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్ల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న వరప్రసాద్, చింతకుంట తండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు రేణుక, గతంలో విద్యా సంవత్సరం ప్రారంభంలో చౌదరిగూడ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయురాలు సరూర్‌నగర్‌కి డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఇటీవలే మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు డిప్యూటేషన్ ఆర్డర్‌లు పొంది మండల విద్యాశాఖ అధికారి నుంచి ఇటీవలే రిలీవ్ ఆర్డర్ పొందినట్లు సమాచారం. వీరి తరహాలోనే మండలంలోని తుమ్మలపల్లి, రావిర్యాల పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు డిప్యూటేషన్ ఆర్డర్ కాపీలు పొంది పట్టణ ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమైనట్లు సమాచారం. బదిలీలు చేయించుకుని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నష్టం కలిగిస్తున్నారు. అక్రమ డిప్యూటేషన్లు ప్రోత్సహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అధికారులు అలసత్వానికి
తావివ్వొద్దు
7 ● కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి దుర్మరణం
బైక్‌ను ఢీకొన్న ట్రాలీ ఆటో 8



ఆటల పోటీలను తిలకిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య

ఆటలతో స్నేహపూర్వక వాతావరణం

- మంత్రి శ్రీధర్ బాబు

మొయినాబాద్ రూరల్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల్లో నిర్వహించే క్రీడల పోటీల ద్వారా విద్యార్థుల మధ్య స్నేహపూర్వకమైన వాతావరణం పెరుగుతుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్కేపల్లి వార్డు పరిధిలోని శ్రీ స్వామినారాయణ్ ఇంటర్నేషనల్ గురుకుల్ పాఠశాలలో 'గురుకుల్-2025 ఒలింపిక్స్' పేరిట ఆటల పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ మంత్రి మాట్లాడారు. స్వామినారాయణ్ ఇంటర్నేషనల్ గురుకుల్ పాఠశాలలో చదివే విద్యార్థులు విద్యతో పాటు భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తారని చెప్పారు. ఈ విద్యా సంస్థలో క్రీడల పోటీలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యం వెలుగులోకి వస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తుందని గుర్తుచేశారు. రాబోయే కాలంలో ఒలింపిక్స్ పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు అధిక పతకాలు సాధించేలా తీర్చుదిద్దుతున్నట్లు మంత్రి చెప్పారు. అధిక నిధులు కేటాయించి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, సుఖ్‌వల్లభ్ దాస్ స్వామి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుపై ఫిర్యాదుల విచారణ



గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుపై ఫిర్యాదులను విచారిస్తున్న డిప్యూటీ కలెక్టర్ రాజు

కడ్తాల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కడ్తాల్ మండలంలోని ఎక్వాయిపల్లి గ్రామంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజు ఆధ్వర్యంలో వచ్చిన ఫిర్యాదులను బుధవారం విచారించారు. ఈ సందర్భంగా బాధిత రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులు తమ అభిప్రాయాలను తెలిపారు. రెండు పాయింట్స్‌తో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. భూ పరిహారం అందించాలని, లేదంటే మొదటి ఫేస్‌లో కొంగర కలాన్‌లో ఇచ్చిన విధంగా ఎకరాకు కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు తమ అభిప్రాయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో రైతులు జోగు వీరయ్య, పాలకుర్ల కరుణాకర్, రమేశ్‌నాయక్, జెన్నయ్య, పాండయ్య, నారాయణ, నరేశ్, శివ, నర్సింహ్మా, మల్లయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జిల్లాలో జాగృతి జనం బాట

షాద్‌నగర్ అర్బన్/మహేశ్వరం/ చేవెళ్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గురువారం జిల్లాలో జాగృతి జనం బాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుడిగాలి పర్యటన చేయనున్నారు. శంకర్‌పల్లి మండలం మోకిలలో ఉదయం 11.30 గంటలకు శ్రీ ఎల్లమ్మ, పోచమ్మ ఆలయాలను సందర్శిస్తారు. మధ్యాహ్నం 12.00 గంటలకు చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్ మండల కేంద్రంలో 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం చేపట్టిన బీసీ సంఘాల దీక్షకు సంఘీభావం తెలుపనున్నారు. 1.30 గంటలకు షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శిస్తారు. 2.30 గంటలకు షాద్‌నగర్‌లోని ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని సందర్శిస్తారు. సాయంత్రం 4 గంటలకు కేశంపేట మండలంలోని తొమ్మిది రేకుల గ్రామంలో త్రిపులార్(ఆర్ఆర్ఆర్) భూ నిర్వాసితులతో సమావేశం కానున్నారు. 5.30 గంటలకు కొత్తూర్ మండలంలోని జేపీ దర్గాను సందర్శిస్తారు. సాయంత్రం 7 గంటలకు మహేశ్వరం నియోజకవర్గంలోని రాజరాజేశ్వరి ఆలయాన్ని సందర్శిస్తారని తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి తెలిపారు. అనంతరం హైదరాబాద్‌కు వెళ్లనున్నారని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తెలంగాణ ఉద్యమకారులు, జాగృతి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

మెయిల్ పంపిన గుర్తుతెలియని దుండగులు

శంషాబాద్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మరోసారి బాంబు బెదిరింపు మెయిల్ కలకలం రేపింది. విమానాశ్రయంలోని టెర్మినల్‌ను పేల్చేస్తామని మంగళవారం గుర్తుతెలియని దుండగులు జీఎంఆర్‌కు మెయిల్ పంపించారు. మరోసారి బుధవారం సాయంత్రం 4:35 గంటలకు ఎస్ఓసీసీ నుంచి ఏపీఓసీ ద్వారా ఆర్‌జీఐఏ కస్టమర్ సపోర్ట్ జీహెచ్ఐఎల్‌కు గుర్తుతెలియని ఐడీ నుంచి మెయిల్ చేశారు. అధికారులు వెంటనే భద్రతా బలగాలకు సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమై బాంబు, డాగ్ స్క్వాడ్‌లు టెర్మినల్‌లో తనిఖీలు నిర్వహించారు.

టీచర్ డిప్యూటేషన్‌ను రద్దు చేయాలి



ఉపాధ్యాయులను పాఠశాలలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్న విద్యార్థులు

అధికారుల తీరుపై విద్యార్థుల ఆగ్రహం

- ముద్విన్ ఉన్నత పాఠశాలకు తాళం వేసి నిరసన
- మూడు నెలలుగా భౌతిక శాస్త్రం టీచర్ లేక నష్టపోతున్నామంటూ ఆందోళన
- స్థానికుల హామీతో విరమణ
- డిప్యూటేషన్ రద్దు చేయించాలని ఎమ్మెల్యేకు స్థానికుల వినతి

కడ్తాల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా భౌతిక శాస్త్రం టీచర్ లేక ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని కడ్తాల మండలం ముద్విన్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆగ్రహించారు. డిప్యూటేషన్‌పై పంపిన ఉపాధ్యాయురాలిని తిరిగి పాఠశాలకు పంపాలని అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని బుధవారం పాఠశాల ప్రధాన ద్వారం గేటుకు తాళం వేసి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. డిప్యూటేషన్ రద్దు చేసి ఉపాధ్యాయురాలిని పాఠశాలకు పంపే వరకు కదిలేది లేదని భీష్మించారు. ఉదయం 8 గంటలకే 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాఠశాల వద్దకు చేరుకొని గేటు వద్ద బైఠాయించారు. టీచర్లు పాఠశాలలోకి వెళ్లకుండా గేటు వద్దే అడ్డుకున్నారు. టీచర్ లేకుంటే తమకు భౌతిక శాస్త్రం ఎవరు బోధిస్తారంటూ విద్యార్థులు మండిపడ్డారు. ముద్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ టీచర్‌గా పనిచేసే ప్రవీణను మన్సురాబాద్ ఉన్నత పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించారు. మరొకరికి జీహెచ్ఎంగా పదోన్నతి లభించి నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో మూడు నెలలుగా ఫిజిక్స్ టీచర్ లేక 8, 9, 10వ తరగతి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, డీఈవో, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేకపోయింది. నెలల కొద్దీ ఉపాధ్యాయుడు లేక ఫిజిక్స్ బోధన ఇబ్బందిగా మారిందని, డిప్యూటేషన్ ఇచ్చిన ఉపాధ్యాయురాలిని తిరిగి పాఠశాలకు పంపాలని ప్రధానోపాధ్యాయురాలు నిర్మల ఉన్నతాధికారులకు పలు మార్లు నివేదించారు. అయినప్పటికీ టీచర్‌ను నియమించకపోవడంతో విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. మంగళవారం గ్రామంలో ప్రధాన రహదారి పై ధర్నా, రాస్తారోకో చేపట్టారు. అయినప్పటికీ స్పందన లేకపోవడంతో పాఠశాలకు తాళం వేసి నిరసన తెలిపారు. స్థానిక నాయకులు నరేశ్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, నర్సింహ్మా, జయసూర్య, శివ, నవీన్, శేఖర్ తదితర నాయకులు విద్యార్థుల వద్దకు వచ్చి విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయారు. ఉన్నతాధికారులకు తెలిపి రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే మండల కేంద్రంలో తామే ఆందోళన చేపడుతామని విద్యార్థులకు నచ్చజెప్పి తిరిగి పాఠశాలలోకి పంపించారు.

బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చంద్రశేఖర్

తాండూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని బహుజన సమాజ్ వాదీ పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్రకో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. తాండూరుకు చెందిన ఆయన పార్టీ అధినేత్రి మాయవతిని కలిసి రాష్ట్రంలో పార్టీ పరిస్థితిపై వివరించారు. లోక్‌సభ ఎన్నికలు ఎప్పుడైనా రావొచ్చని, అందుకు పార్టీ శ్రేణులను సిద్ధం చేయాలని చెప్పారన్నారు.

విద్యార్థుల ఆచూకీ లభ్యం

తాండూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తాండూరులోని ఎన్టీఆర్ కాలనీలోని తెలంగాణ సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి మోత్కుపల్లికి చెందిన 8వ తరగతి విద్యార్థి వినయ్‌కుమార్, 9వ తరగతి విద్యార్థి హర్షవర్ధన్‌లు బుధవారం ఉదయం బయటకు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పేరెంట్స్ వెంటనే హాస్టల్‌కు చేరుకొని విచారించారు. చివరకు సీసీ కెమెరాల ఆధారంగా విద్యార్థులు మోమిన్‌పేట్‌లో దొరికారు.

రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

శామీర్‌పేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మాస శివరాత్రిని పురస్కరించుకొని శామీర్‌పేటలోని భవానీరామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానార్చకుడు మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, మంత్ర పుష్పం, అర్చన, తీర్థప్రసాద వితరణ చేశారు. భజన మండలి బృందాల ఆధ్వర్యంలో భజనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు



మాట్లాడుతున్న చినజీయర్ స్వామి

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

మహేశ్వరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి తెలిపారు. బుధవారం మహేశ్వరం మండలం మన్‌సాన్‌పల్లి కొత్తతండాలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ కన్వెన్షన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసిన అనంతరం జీయర్ మాట్లాడుతూ కల్యాణ మండపాలైనా, కన్వెన్షన్ హాల్స్ అయినా.. శుభకార్యాలకు మాత్రమే ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలన్నారు. అదేవిధంగా డిసెంబరు 1న భగవద్గీత ఆవిర్భావ దినోత్సవాన్ని ముచ్చింతల్‌లోని శ్రీ శ్రీమన్నారాయణ సన్నిధిలో నిర్వహిస్తున్నామని, భక్తులు అధికసంఖ్యలో హాజరు

గడువులోగా హైవే విస్తరణ పనులు పూర్తి

చేవెళ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయిస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. బుధవారం స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అలాగే చేవెళ్ల మండల పరిధిలోని దామరిగిద్ద గ్రామ పరిధిలో పత్తి మిల్లు వద్ద కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే యాదయ్య ప్రారంభించారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ ఛైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్‌ఛైర్మన్ రాములు, మాజీ సర్పంచులు, వీరేందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, తదితరులు ఉన్నారు.

వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలివ్వాలి

వికారాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి):వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని, చనిపోయిన కుటుంబాలకు ప్రమాదబీమా, ఉద్యోగం ఇవ్వాలని సీఐటీయూ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మహిపాల్ పేర్కొన్నారు. బుధవారం వికారాబాద్‌లోని ఎమ్మెల్యే కార్యాలయాన్ని వీఆర్‌ఏలు ముట్టడించారు. గతంలో ప్రభుత్వం వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 21న కలెక్టరేట్ ముట్టడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, జనార్ధన్, రాజు సంగమేశ్, శ్రీనివాస్, రమేష్, గోపాల్, నర్సిములు, అనంతయ్య, సంగమేశ్, మోహన్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కేంద్రం పెద్దపీట

చేవెళ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తూ నిధులు మంజూరు చేస్తుందని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తెలిపారు. బుధవారం చేవెళ్ల మండలం ధర్మసాగర్‌లో ఎంపీ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులు గ్రామస్తులతో కలిసి ఆయన ప్రారంభించారు. బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్ ముదిరాజ్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు డాక్టర్ వైభవ్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ, బోజిరెడ్డి, కృష్ణ, వెంకటేశ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

జిల్లా యువజనోత్సవాలు-2025
పోటీల్లో పట్నం విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డా.రాధిక తదితరులు

ఇబ్రహీంపట్నం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా యువజనోత్సవాలు-2025 పోటీల్లో ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సాహిత్య, సాంస్కృతిక విభాగాల్లో చక్కటి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.రాధిక తెలిపారు. కథా రచనలో బీఎస్సీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని టీనాకుమారి మొదటి బహుమతి, కవితా రచనలో బీకాం ప్రథమ సంవత్సరం విద్యార్థి సాయికృప ద్వితీయ బహుమతి, చిత్రలేఖనంలో బీకాం ప్రథమ సంవత్సరం విద్యార్థిని రజిత ద్వితీయ బహుమతి సాధించారని చెప్పారు. డా.చింతల రాకేష్ భవానీ, అధ్యాపక బృందం అభినందించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డా.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మరికొన్ని గంటల్లో డెలివరీ... అదృశ్యమైన గర్భిణి

- కింగ్‌కోఠి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఘటన
- బాధితురాలిది మంచాల మండలం కాగజ్‌ఘట్ గ్రామం

మంచాల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మరికొన్ని గంటల్లో డెలివరీ కావాల్సిన గర్భిణి ఇంతలోనే ఆసుపత్రి ఆవరణలో నుంచి కనిపించకుండా పోయింది. ఈ ఘటన నగరంలోని కింగ్‌కోఠి ప్రసూతి ఆసుపత్రిలో జరిగింది. బాధితురాలిది రంగారెడ్డి జిల్లా, మంచాల మండల పరిధి కాగజ్‌ఘట్ గ్రామం. వివరాల్లోకి వెళితే... గ్రామానికి చెందిన స్వప్న(25) తన భర్త శివకుమార్‌తో కలిసి మంగళవారం కింగ్‌కోఠిలోని ప్రసూతి ఆసుపత్రికి వెళ్లింది. ఆసుపత్రి ఆవరణలో కొద్దిసేపు భర్తతో కలిసి ఉన్నస్వప్న కొద్దిసేపటికే చెప్పాపెట్టకుండా బయటకు వెళ్లి అటు నుంచి ఆటోఎటో వెళ్లిపోయింది. భార్య ఎంతసేపటికీ రాకపోవడంతో ఆందోళన చెందిన శివకుమార్ సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గర్భిణి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు.

విమానంలో ప్రయాణికుడికి అస్వస్థత

శంషాబాద్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి భువనేశ్వర్‌కు వెళ్తున్న ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానంలో అన్షుమాన్ చక్రవర్తి అనే ప్రయాణికుడు అస్వస్థతకు గురయ్యాడు. అతను ఆకస్మాత్తుగా అపస్మారక స్థితిలో పడిపోవడంతో వెంటనే ఎయిర్‌పోర్టు మెడికల్ సెంటర్‌కు సమాచారం అందించారు. ఎయిర్‌లైన్స్ సిబ్బంది ఎస్కార్ట్‌లో ప్రయాణికుడిని అపోలో ఏఎంసీ బేస్‌మెంట్‌కు తరలించారు. అత్యవసర చికిత్స కారణంగా తదుపరి ప్రయాణాన్ని కోల్పోయిన కారణంగా ఆ ప్రయాణికుడిని ఆఫ్‌లోడ్ చేసింది. చికిత్స పొందిన తర్వాత ప్రయాణికుడు పీటీబీ నుంచి ఆఫ్ లోడింగ్ ఫార్మాలిటీలను పూర్తి చేసేందుకు ఎయిర్‌లైన్స్ సిబ్బందితో ఏఎంసీ నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. అదే విధంగా హైదరాబాద్ నుంచి రాజమండ్రికి ఇండిగో విమానంలో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడు తన మామ యశోద ఆసుపత్రిలో చేరడంతో స్వయంగా ఆఫ్‌లోడ్ చేశారు. మిగతా ప్రయాణికులను సంబంధిత ఎయిర్‌లైన్స్ సిబ్బంది తదుపరి ఆఫ్‌లోడింగ్ ఫార్మాలిటీల కోసం దేశీయ బదిలీల ప్రాంతానికి తిరిగి తీసుకొచ్చారు.

ఎమిరేట్స్ విమానాన్ని ఢీకొన్న పక్షి?

శంషాబాద్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దుబాయ్ వెళ్తున్న ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ ఈకే 529 విమానం బుధవారం రాత్రి 9.25 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి టేకాఫ్ తీసుకుంది. ఆ సమయంలో విమానాన్ని పక్షి ఢీకొన్నట్లు అనుమానించిన పైలెట్ ఏటీసీ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే ఏటీసీ అధికారులు సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. అధికారులు రన్‌వేపైకి వెళ్లి చూడగా అక్కడ పక్షి ఆనవాళ్లు లేవని నిర్ధారించారు. అదే విషయం ఏటీసీ అధికారులు తిరిగి పైలెట్‌కు సమాచారం అందించారు. దీంతో విమానం దుబాయ్ బయలుదేరి వెళ్లింది.

వెలుగులోకి జ్యువెలర్ షాపు యజమాని మోసాలు

- మూసి ఉన్న దుకాణం వద్ద బాధితుల ఆందోళన



కులకచర్లలో అజయ్ జ్యువెలర్ షాపు ఎదుట బాధితులు

కులకచర్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కులకచర్లలో అజయ్ జ్యువెలర్స్ షాపు యజమాని నరేందర్ చౌదరి మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకొస్తున్నాయి. బుధవారం బాధితులు షాపు వద్దకొచ్చారు. జ్యువెలర్స్ షాపులో బంగారం తాకట్టు పెట్టిన వారు, అప్పు ఇచ్చిన వారు లబోదిబోమంటున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. నరేందర్‌చౌదరి కొందరి బంగారం తాకట్టు పెట్టుకొని డబ్బులు ఇవ్వలేదు. కొందరి వద్ద రూ.లక్షల్లో అప్పుచేసి గత శనివారం కుటుంబ సభ్యులతో పరారైన విషయం తెలిసిందే. రూ.2కోట్లకుపైగానే ఖాతాదారులకు డబ్బులివ్వాల్సి ఉందని చెబుతున్నారు. ఆగ్రహంతో బాధితులు మార్వాడీ బంగారు దుకాణాలను బంద్ చేయించారు. బాధితుడు గోపాల్‌నాయక్ మాట్లాడుతూ.. తాను నరేందర్‌చౌదరికి రూ.13లక్షలు అప్పు ఇచ్చానన్నాడు. మరో రూ.10లక్షలకు జమానత్ ఉన్నట్టు తెలిపాడు. మరో బాధితురాలు మంగమ్మ మాట్లాడుతూ.. తనకు ఆభరణం చేసివ్వాలని 15గ్రాముల బంగారం ఇచ్చానంది. బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. నరేందర్‌కు తాను 5లక్షల నగదు, 3తులాల బంగారు గొలుసు ఇచ్చానన్నాడు. అతడి మాయమాటలకు మోసపోయామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు అతడిని పట్టుకొని తమ డబ్బు, బంగారాన్ని రికవరీ చేయాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారులు అలసత్వానికి తావివ్వొద్దు

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల లక్ష్యాల పూర్తిలో అధికారులు అలసత్వానికి తావివ్వకూడదని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. అవినీతి, అక్రమాలకు చోటు లేకుండా, లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్నిస్థాయిల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఆమనగల్లు, కడ్తాల్, కల్వకుర్తి మండలాల్లో బుధవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, గృహ నిర్మాణశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. ఎంపీడీవోలు మాధురి, సుజాత, శ్రీకాంత్, విజయలక్ష్మి, కమిషనర్ శంకర్ నాయక్, శాలిని, శ్రీనివాస్ రెడ్డి, ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, గూడూరు భాస్కర్ రెడ్డి, యాట నర్సింహ్మా, భృంగి ఆనంద్ కుమార్, అశోక్‌రెడ్డి, పర్వత్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కడ్తాల్ : మండల పరిధిలోని మైసిగండికి చెందిన పూజారి బీచ్య నాయక్ సతీమణి రామావత్ లక్ష్మి అనారోగ్యంతో మృతిచెందింది. బుధవారం మృతదేహాన్ని మైసిగండిలోని ఆమె నివాసంలో ఎమ్మెల్యే కసిరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. బీచ్యనాయక్, కుటుంబసభ్యులను పరామర్శించారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, సిరోలి పంతూ, కమ్లీ మోత్యనాయక్, తులసీరామ్ నాయక్, శేఖర్‌గౌడ్, పాండునాయక్, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే సమన్యాయం



మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

షాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే బడుగు, బలహీన వర్గాలకు సమన్యాయం చేకూరుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎల్గొండగూడలో బీఆర్‌ఎస్ గ్రామ పంచాయితీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రఘునందన్‌రెడ్డితో పాటు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకులు 50 మంది నాయకులు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు దశలవారీరిగా అమలు చేస్తుందన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, ప్రతాప్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌గౌడ్, చేవెళ్ల స్వామి, ఖాజామియాపటేల్, అంజనేయులుగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, రాహుల్‌గుప్తా, రవీందర్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి, నర్సింహులు, కృష్ణారెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శేఖర్, రాఘవేందర్, సూర్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, జాంగీర్, రమేష్, మహేష్, కిషోర్, నరేందర్ పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు



వేడుకల్లో విజయలక్ష్మి, శ్రీధర్, అంగన్‌వాడీలు, చిన్నారులు

శామీర్‌పేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నేటి బాలలే భావి పౌరులని, అంగన్‌వాడీల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తున్నామని హెచ్‌బీఎల్ సీఎస్‌ఆర్ అసోసియేట్ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం తూంకుంట పరిధి 17అంగన్‌వాడీ కేంద్రాల్లో తమ సంస్థ ఏడో వార్షికోత్సవాలను, బాలల దినోత్సవాన్ని హెచ్‌బీఎల్ ఇంజనీరింగ్ పరిశ్రమ సీఎస్‌ఆర్ అసోసియేట్ విజయలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ శ్రీధర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. దేవరయంజాల్, తూంకుంట, హకీంపేట, పోతాయిపల్లి, సింగాయిపల్లిల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పిల్లలు, వారి తల్లులు వేడుకల్లో పాల్గొన్నారు. తూంకుంట, అలియాబాద్ మునిసిపాలిటీల్లోని అంగన్‌వాడీ సెంటర్లను తాము దత్తత తీసుకొని పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

కొడంగల్ రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అగాఖాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు, ఆశా కార్యకర్తలకు కొడంగల్‌లో ఈసీడీపై శిక్షణ ఇచ్చారు. పిల్లల శారీరక, మానసిక, సామాజిక అభివృద్ధికి సంబంధించిన అంశాలు, పోషకాహార పంపిణీ, టీకాలు వేయడం, ఆరోగ్య తనిఖీలు, కథల ద్వారా అభ్యసన తదితరాలపై శిక్షణ నిచ్చారు. కార్యక్రమంలో సీడీపీవో రూప, సూపర్‌వైజర్లు, ఫౌండేషన్ ఈసీడీ ప్రాజెక్ట్ సిబ్బంది సుమలత, మమత, సంపత్, భూపతి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, ఎంఐఎం నేతలు
కాంగ్రెస్‌లో చేరిక



నయీంతో చర్చిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):తాండూరులో బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీల ముఖ్య నేతలు నయీం, సాజిత్‌లను కాంగ్రెస్‌లో చేరారు. గతంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడిగా ఉన్న నయీం(అప్పు), అప్పటి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డితో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరి పట్టణాధ్యక్షుడిగా, ఆయన సతీమణి కౌన్సిలర్‌గా పనిచేశారు. ఆయన సమీప బంధువు ముక్తార్‌నాజ్ సైతం కౌన్సిలర్‌గా గెల్చారు. స్టోన్ ట్రేడర్స్ అసోసియేషన్ ప్రతినిధిగా ఉన్న నయీం, ముక్తార్‌నాజ్‌తో కలిసి కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్‌ఎస్‌కు పట్టణంలో బలం తగ్గినట్టయింది. అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు హైదరాబాద్‌లోని నయీం ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే ఎంఐఎంలో క్రియాశీలకంగా పనిచేసిన మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ సాజిత్ సైతం కాంగ్రెస్‌లో చేరారు. సాజిత్ సతీమణి కూడ కౌన్సిలర్ గెల్చారు. వీరి చేరికతో తాండూరు మునిసిపాలిటీలో హస్తం పార్టీ మరింత బలోపేతం అవుతుందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు హబీబ్‌లాల దీమా వ్యక్తం చేశారు.

పక్కాగా పెన్షన్ పంపిణీ చేయాలి

- మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధికాగుప్తా



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

మేడ్చల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ పక్కాగా జరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో చేయూత పెన్షన్లపై సెర్ప్ పెన్షన్ విభాగానికి చెందిన డైరెక్టర్ గోపాల్‌రావు ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్, డీఆర్‌డీఓ సాంబశివరావు, జీహెచ్ఎంసీ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎండీఓలు, పోస్టల్ డిపార్ట్‌మెంట్, బిల్‌కలెక్టర్, వార్డు ఆఫీసర్లు, సెక్రటరీ డీపీఎం పెన్షన్ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగులు, కల్లు గీత కార్మికులు, చేనేత కార్మికులు, బీడీ కార్మికులు, బీడీ టేకేదార్లు, ఎయిడ్స్ పైలేరియా, డయాలసిస్ బాధితులకు వాటికి సంబంధించి పెన్షన్లపై అవగాహన కల్పించారు. జిల్లాలో లక్షా 42 వేల 383 మంది లబ్ధిదారులు ప్రతి నెలా రూ.34 కోట్ల 40 లక్షల 92 వేలు ఆర్థికసాయం పొందుతున్నారని వివరించారు. ఫేషియల్ రికగ్నైజేషన్ ఆప్ ద్వారా పెన్షన్ల పంపిణీ జరుగుతుందని, నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్స్ ప్రకారం కుటుంబ పెద్ద చనిపోయినట్లయితే ఆ కుటుంబానికి రూ.20 వేలు అందుతాయన్నారు. అనంతరం డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో చేయూత పెన్షన్లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

ఎన్కతల శివారులో చిరుత కలకలం



మోమిన్‌పేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్కతల శివారులో బుధవారం చిరుత పులి సంచారం కలకలం రేపింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఎన్కతల ఇండస్ట్రియల్ పార్కుకు కేటాయించిన ప్రాంతంలో బుధవారం చిరుత కనిపించిందని అందులో పని చేస్తున్న రమేశ్ తెలిపాడు. దీంతో ఇండస్ట్రియల్ పార్కు పరిధిలో పని చేస్తున్న ఇంజినీర్లు, కూలీలు, డ్రైవర్లు, స్థానికులు, రైతులు భయాందోళనకు గురయ్యారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించగా అధికారులు అక్కడికి పరిశీలించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా పొలాలకు వెళ్లొద్దని సూచించారు.

బస్సు ప్రమాద బాధితులకు చెక్కుల అందజేత



బాధితులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయపడిన పది మందికిగాను ఒక్కొక్కరికి రూ.2లక్షల చెక్కులను బుధవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ బాల్‌రెడ్డి, తహసీల్దార్ తారాసింగ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, నాయకులు ఉత్తమ్‌చంద్, సంపత్‌కుమార్ ఉన్నారు.

బీసీల ద్రోహి కాంగ్రెస్



మాట్లాడుతున్న శుభప్రద్ పటేల్

వికారాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి మోసం చేస్తున్నారని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. బుధవారం వికారాబాద్‌లోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి బీసీలకు 42శాతం రిజర్వేషన్లను పార్టీ పరంగా ఇస్తే ఒప్పుకోం అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను ప్రభుత్వం ఎందుకు నిలపెట్టుకోవడం లేదని ప్రశ్నించారు. కేంద్రం నుంచి రిజర్వేషన్లు సాధిస్తామన్న రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారో తెలపాలన్నారు. ఎన్నికలు నిర్వహించక పల్లెల్లో అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్లలో ఒక్క శాతం తగ్గినా బలహీన వర్గాల ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు.

ఎల్వోసీ అందజేసిన స్పీకర్

ధారూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మున్నూరు సోమారానికి చెందిన వడ్ల సుగుణమ్మ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందింది, ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.1.25లక్షల విలువైన ఎల్వోసీని అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు గోవర్ధన్ ఉన్నారు.

సదస్సులతో మేధాశక్తిని పెంచుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో బుధవారం అంతర్జాతీయ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ)ను ప్రారంభించారు. ఐటీ విభాగంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ విద్యాసంస్థల నుంచి 170మంది పాల్గొన్నారు. వర్సిటీ ఐటీ విభాగాధిపతి నీతిషాశర్మ మాట్లాడుతూ... విద్యార్థులు అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని మేధాశక్తిని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీపీ కన్వీనర్లు ఆశా కిరణ్, పద్మజా, కుమార్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏఆర్‌ఎఫ్‌ఎఫ్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్

శంషాబాద్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏఆర్‌ఎఫ్‌ఎఫ్ ఆధ్వర్యంలో అగ్నిమాపక తరలింపు మాక్ డ్రిల్ నిర్వహించారు. బుధవారం నోవాటల్‌లో అగ్నిమాపక తరలింపు మాక్ డ్రిల్‌లో వివిధ ఏజెన్సీలకు చెందిన మొత్తం 181 మంది సిబ్బంది పాల్గొన్నారు. మాక్ డ్రిల్‌లో నోవాటెల్ సిబ్బంది 162 మంది, ఏఆర్‌ఎఫ్‌ఎఫ్ నలుగురు, అపోలో సిబ్బంది ముగ్గురు, రాక్సా సిబ్బంది 12 మంది పాల్గొన్నారు.

యాంటీబయాటిక్ వాడకంపై సదస్సు

మేడ్చల్ టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అతిగాయాంటీ బయాటిక్ మందుల వాడటంతో ఉత్పన్నమవుతున్న దుష్పరిణామాలపై బుధవారం మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. విచ్చలవిడిగా యాంటీబయాటిక్‌ల వాడకంతో ఆరోగ్యరంగా దుష్పరిణామాలు ఎదురవుతున్నాయని వైద్య నిపుణులు హెచ్చరించారు. దానివాడకాన్ని తగ్గించి సురక్షిత వైద్యాన్ని అందించే విధానాలపై చర్చించారు.



సదస్సులో పాల్గొన్న వైద్యులు

ప్రజా సమస్యలు పట్టవా?

● రెవెన్యూ అధికారులు, సిబ్బంది తీరుపై మాజీ ఎమ్మెల్యే బక్కని ఆగ్రహం

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండల రెవెన్యూ సిబ్బంది ప్రజా సమస్యలను ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ధ్రువీకరణ పత్రాలు, విద్యార్థులకు కులం, ఆదాయం, స్థానికం సర్టిఫికెట్ల కోసం రోజుల తరబడి తిప్పుకుంటున్నారన్న సమాచారం మేరకు బుధవారం రెవెన్యూ ఆఫీసుకు వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని లింగారెడ్డిగూడకు చెందిన చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి తన పట్టా భూమిలో వ్యవసాయం చేస్తున్నట్టుగా ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకోగా పత్రం ఇవ్వకుండా తిప్పుకుంటున్నారని, రైతు మాట్లాడితే నిర్లక్ష్యంగా జవాబు చెప్పారన్నారు. అలాగే కులం, ఆదాయం, స్థానిక ధ్రువపత్రాల కోసం కార్యాలయం చుట్టూ రోజుల తరబడి ప్రజలు, విద్యార్థులు తిరుగుతున్నారని, తహసీల్దార్ విధుల్లో ఉన్నా.. డిప్యూటేషన్‌పై వచ్చిన డీటీచే భూముల రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారని అన్నారు. ఇప్పటికే ప్రభుత్వ భూములు అక్రమ రిజిస్ట్రేషన్లు కాబడి అన్యాక్రాంతమైనాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూముల పట్టా మార్పిడిని బాధ్యత కల్గిన తహసీల్దార్ చేయాలని డిమాండ్ చేశారు. పలు సమస్యలపై ప్రశ్నిస్తే, తనతో కూడా నిర్లక్ష్యంగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల వ్యవహారంపై కలెక్టర్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

ఇందిరమ్మ.. ఇదేందమ్మా!

(ఐదో పేజీ తరువాయి)

పంచాయతీరాజ్ శాఖ వెబ్‌సైట్‌లో తప్పుడు పేర్లు నమోదు చేసిన ఘటన అదే మండలంలో చోటుచేసుకుంది. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం మీ ఖాతాలో లక్షరూపాయలు జమయ్యాయని, వాటిని విత్‌డ్రా చేసి తమకు ఇవ్వాలంటూ ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగి, మరో వ్యక్తి చెప్పడంతో ఆమె అవాక్కయ్యింది. ఇల్లే మంజూరు కాలేదని, డబ్బులు ఎలా వచ్చాయంటూ సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆమె ఆరా తీశారు. డబ్బులు తిరిగి ఇవ్వకుంటే నీపైన కేసు పెడతామంటూ గ్రామానికి చెందిన ఒకరు, పంచాయతీ సిబ్బంది మరొకరు బెదిరింపులకు గురి చేసినట్లు బాధితురాలు 'ఆంధ్రజ్యోతి'తో వెల్లడించింది. దీంతో తీగ లాగితే డొంకంతా కదిలినట్లు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో జరుగుతున్న అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. స్థలం ఎంపిక విషయంలో ప్రభుత్వ పరంగా చాలా నిబంధనలున్నాయి. వాటిన్నిటికీ భిన్నంగా ఈ ఇంటి నిర్మాణం జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇంటిని మంజూరు చేసిన అధికారుల చిత్తశుద్ధిని ప్రశ్నిస్తుంది. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల వివరాలు ఇలా ఉన్నాయి.

పావని పేరును.. పవన్‌కుమార్‌గా మార్పు..

కొందుర్గు మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడి భార్య పావని ఇందిరమ్మ ఇంటి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంది. ఇంటి మంజూరు కోసం ఉన్న నిబంధనలు అన్నీ పూర్తయిన తర్వాత ఆమెకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఈ విషయాన్ని ఎంపీడీవో, గ్రామ కార్యదర్శి, ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులతో సహా ఎవరూ కూడా లబ్ధిదారులకు సమాచారం ఇవ్వలేదు. ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయడంలో ప్రభుత్వ పరంగా కొన్ని నిబంధనలున్నాయి. వాటిలో నిరుపేదలు, పేదలు, దివ్యాంగులతో పాటు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. కానీ ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుల ఒత్తిడి కారణమేమో కానీ ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు కాకుండా ఇతరుల పేరిట ఇల్లు మంజూరు చేయించినట్లు సమాచారం. దీనికి సంబంధించి ఇందిరమ్మ ఇంటి వెబ్‌సైట్‌లో కూడా పావని పేరును పవన్‌కుమార్‌గా మార్చారు. కానీ, బ్యాంకు ఖాతా వివరాలను మార్చకపోవడంతో ఇంటి నిర్మాణానికి సంబంధించి పావని ఖాతాలో డబ్బులు జమయ్యాయి.



పావని నివాసం ఉంటున్న గుడిసె

డబ్బులు ఇవ్వకపోతే కేసు పెడతాం..

ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులకు ఆదాయ వనరుగా మారిందన్న విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి. చెరుకుపల్లికి చెందిన పావనికి మంజూరైన ఇంటిని ఆన్‌లైన్‌లో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పవన్‌కుమార్‌గా మార్చారు. కార్యాలయ సిబ్బంది అనుకూలంగా వ్యవహరించడంతో పవన్‌కుమార్ వెంటనే మంజూరైన స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టి పనులకు సంబంధించిన ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాడు. దీంతో గృహనిర్మాణ అధికారులు పావని బ్యాంకు ఖాతాలో లక్షరూపాయలు జమ చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో కార్యాలయానికి సంబంధించిన ఒక వ్యక్తితో పాటు పవన్‌కుమార్‌లు కలిసి పావని ఇంటికి వెళ్లి ఇంటి నిర్మాణానికి సంబంధించి నీ ఖాతాలో లక్షరూపాయలు జమ అయ్యాయని, వాటిని డ్రా చేసి తమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో అసలైన లబ్ధిదారు తనకు ఇల్లే మంజూరు కాలేదని, డబ్బులు ఎలా వచ్చాయని నిలదీసింది. డబ్బులు ఇస్తావా? లేదా కేసు పెట్టాలా? అంటూ ఆమెను తీవ్ర భయభ్రాంతులకు గురి చేశారు. దీంతో అనుమానం వచ్చిన పావని డబ్బులను డ్రా చేయకుండా అసలు విషయాన్ని 'ఆంధ్రజ్యోతి'తో తన గోడును వెల్లబోసుకుంది.

వ్యవసాయ పొలంలో ఇంటి నిర్మాణం

కొందుర్గు మండలం చిన్న ఉమ్మెంత్యాల గ్రామానికి చెందిన వెంకటమ్మ ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకుంది. తనకున్న స్థలాన్ని గ్రామ కమిటీ సభ్యులతో పాటు, పంచాయతీ సిబ్బందికి కూడా చూపించింది. అయితే ఆ ఇంటి స్థలం విషయానికి సంబంధించి వారి కుటుంబ సభ్యుల మధ్య గొడవలు వచ్చాయి. దీంతో ఆమె తన కుమారుడికి చెందిన వ్యవసాయ పొలంలో ఇంటి నిర్మాణం పనులు చేపట్టింది. దీనికి సంబంధించి పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఆమె ఖాతాలో రూ.2లక్షలు జమ చేశారు. ఈవిషయం గురించి సంబంధిత ఎంపీడీవో సిబ్బందిని వివరణ కోరగా స్థలం ఉంటే ఎక్కడైనా ఇల్లు కట్టుకోవచ్చని సమాధానం ఇచ్చారు. కానీ వ్యవసాయ పొలంలో ఇంటి నిర్మాణం చేపట్టరాదని, కేవలం 400 ఎస్ఎఫ్‌టీలో మాత్రమే ఇంటి నిర్మాణం చేపట్టాలని ఇందిరమ్మ ఇంటి గైడ్‌లైన్‌లో పొందుపర్చారు. కానీ కొందరు గ్రామస్తులు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నిర్మాణం చేపట్టారని ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారని సమాచారం. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో అవకతవకలు జరుగుతున్నాయని, అర్హులకు మాత్రం ఇండ్లు దక్కడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందించాలని కోరుతున్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం

● మరో విద్యార్థికి తీవ్ర గాయాలు.. బైక్‌ను ఢీకొన్న ట్రాలీ ఆటో



సిద్దార్థ్(ఫైల్)

శంషాబాద్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతిచెందిన సంఘటన బుధవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం, దొంతాపూర్‌నకు చెందిన రామటెంకి సిద్దార్థ్(22) మండల పరిధిలోని కాచారం వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. తన స్నేహితుడు రోహిత్‌తో కలిసి బైక్‌పై మంగళవారం సాయంత్రం 6:30 గంటలకు కళాశాల వైపు వెళ్తున్నాడు. నర్కూడ దాటిన తరువాత చాయ్ దునియా హోటల్ సమీపంలో మల్కారం నుంచి వస్తున్న ఆటో ట్రాలీ వారి బైక్‌ను ఢీకొంది. ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వాహనదారులు శంషాబాద్ ట్రైడెంట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం నగరంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న సిద్దార్థ్ రాత్రి 9 గంటలకు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. చేతికొచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు గాంధీ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బైక్‌పై ఉన్న మరో విద్యార్థికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదానికి కారణమైన ఆటోను శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో నలుగురికి ఒక రోజు జైలు

చేవెళ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు డ్రైవ్ చేసిన నలుగురికి ఒకరోజు జైలు శిక్ష విధిస్తూ చేవెళ్ల కోర్టు జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఉపాధ్యాయ విజయ్‌కుమార్ తీర్పునిచ్చారు. ట్రాఫిక్ సీఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. వాహనాల తనిఖీల్లో భాగంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా కె.శంకర్‌రెడ్డి వాహనం (ఏపీ 29 బీడీ1116), ఇనాయత్ పటేల్(టీఎస్ 07యుకే 6860), చావ శ్రీకాంత్(టీఎస్15 ఎఫ్ఏ909), అఫ్తాబ్(టీఎస్07యుకె6084) డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు నిర్వహించగా మోతాదుకు మించి మద్యం సేవించినట్లు గుర్తించి నలుగురిపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు బుధవారం న్యాయమూర్తి ఉపాధ్యాయ్ విజయ్‌కుమార్ కేసు పూర్వాపరాలు పరిశీలించి ఒకరోజు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఆయన ఆదేశాలతో నలుగురిని సంగారెడ్డి జిల్లా కంది జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

శంషాబాద్ రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నరేందర్‌రెడ్డి కథనం మేరకు.. శంషాబాద్ మండలంలోని బహదూర్‌గూడకు చెందిన ప్రతాప్ సూతర్ గ్రామ శివారులోని ఓ కిరాణా దుకాణంలో గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి బహదూర్‌గూడ గ్రామ శివారులోని లక్ష్మితండా సర్వే నెంబర్ 39 వద్ద ఉన్న కిరాణా దుకాణానికి వెళ్లారు. తనిఖీ నిర్వహించగా ప్రతాప్ సూతర్ గంజాయితో కూడిన ప్లాస్టిక్ కవర్‌తో కనిపించాడు. విచారించగా సెంట్రింగ్ కార్మికుడిగా పని చేస్తున్నట్లు తెలిసింది. సంవత్సర క్రితం జీవనోపాధి కోసం ఒడిషా నుంచి బహదూర్‌గూడకు వచ్చాడు. కొన్ని నెలలుగా ఆరోగ్యం బాగాలేక పని మానేసి అక్కడ ఉన్న చిన్న కిరాణ దుకాణం నడపడం ప్రారంభించాడు. చాలా మంది బిహార్, ఒడిషా తదితర రాష్ట్రాల నుంచి కూలి పనుల కోసం వచ్చి ప్రతాప్ సూతర్ నివసించే ప్రాంతంలో ఉంటున్నారు. ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో ప్రతాప్ గంజాయి అమ్ముతున్నట్లు విచారణలో తెలిసింది. ఈమేరకు గంజాయిని సీజ్ చేసి అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఆమె దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఇందిరమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.



షాబాద్ : నివాళులర్పిస్తున్న మధుసూదన్‌రెడ్డి తదితరులు



షాద్‌నగర్ : ఇందిరాగాంధీ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నాయకులు



ఆమనగల్లు : నివాళులర్పిస్తున్న నాయకులు



చేవెళ్ల : ఇందిరమ్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య తదితరులు



కందుకూరు : హైదరాబాద్-శ్రీశైలం హైవేపై నివాళులర్పిస్తున్న మాజీ జడ్పీటీసీ జంగారెడ్డి, నాయకులు

హరితహారం మొక్కలను సంరక్షించాలి

యాచారం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): హరితహారం కింద నాటిన మొక్కలు ఎండిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాధారాణి తాటిపర్తి పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం గ్రామంలో పర్యటించిన ఆమె ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కాలనీల్లో ఇంకుడు గుంతల నిర్మాణం పనులు పూర్తి చేయాలన్నారు. ఇంటికో ఇంకుడు గుంత నిర్మాణం చేసుకునేలా ప్రజలను చైతన్యం చేయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. వారానికోసారి ఓహెచ్ఎస్ ఆర్ వాటర్‌టాంకులు శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వందశాతం పన్నులు వసూలు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ముమ్మరం చేయాలని లబ్ధిదారులకు సూచించారు.

రైతుల పక్షపాతి ప్రధాని మోదీ

కొందుర్గు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దేశంలోని రైతుల పక్షాన ఆలోచించే ఏకైక నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ అని బీజేపీ మండలాధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు మోదీ అహర్నిశలు కృషి చేస్తున్నారని, అధిక వర్షాల కారణంగా పంటల దిగుబడి తగ్గినా, సకాలంలో రైతుభరోసా అందిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా నిధులు విడుదల చేయాలన్నారు. పీఎం కిసాన్ నిధులను క్రమం తప్పకుండా రైతుల ఖాతాల్లో వేసిన మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.త

రిజర్వేషన్ల సాధనకు.. ఢిల్లీకి తరలిన గిరిజన నాయకులు

కడ్తాల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ ఢిల్లీలో బుధవారం నిర్వహించిన మారో నగారా-జాగో బంజారా కార్యక్రమానికి కడ్తాల మండల కేంద్రం నుంచి గిరిజన నాయకులు పెద్దసంఖ్యలో తరలి వెళ్లారు. కేంద్ర మాజీ మంత్రి రవీందర్ నాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి లక్పతి నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రఘురామ్ రాథోడ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఇందిరా గాంధీ సమాధి వద్ద నివాళులర్పించారు. కేంద్ర ప్రభుత్వం విద్య, ఉద్యోగ, రాజకీయ, అన్ని రంగాలలో గిరిజనులకు జనాభా ప్రాతిపదికన 12శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా, రాష్ట్ర నాయకులు బీచ్యనాయక్, నరేశ్ నాయక్, పత్యనాయక్, రాములు నాయక్, పాండు నాయక్, శంకర్‌నాయక్, సేవ్యనాయక్, లచ్చిరామ్, రాజేందర్, రాజు, రాజ్‌కుమార్, శ్రీను, బీమన్, పవన్, జగన్, సక్రు, తదితరులున్నారు.



ఢిల్లీకి తరలిన గిరిజన నాయకులు

సీఐఎస్ఎఫ్ నూతన కానిస్టేబుళ్లు, జీడీలకు పోస్టింగ్స్

శంషాబాద్ రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా మధ్యప్రదేశ్(బర్వాహ), రాజస్థాన్ (డియోలి), రాజస్థాన్ (బెహ్రోర్), తమిళనాడు (తక్కోలం), ఛత్తీస్‌ఘడ్(బిలాయ్), ఒడిషా(ముండాలి)లో గల సెంటర్లలో శిక్షణ తీసుకున్న 11,729 మంది సీఐఎస్ఎఫ్ కానిస్టేబుళ్లు, జీడీలకు బుధవారం జరిగిన పరేడ్‌లో పోస్టింగ్స్ ఇచ్చారు. ఇందులో దాదాపు 1,896 మంది మహిళా సిబ్బంది ఉన్నారు. దాంతో సీఐఎస్ఎఫ్ నియామకాల్లో దాదాపు 8 శాతం వృద్ధి జరిగిందని అధికారులు వెల్లడించారు. కాగా, ఎక్కువ సిబ్బందిని అంతర్జాతీయ విమానాశ్రయాలు, డీఎంఆర్సీ యూనిట్లు, ప్రాజెక్టుల నిర్వహణ, బేవార్, నవీ ముంబయి విమానాశ్రయం, భక్రా ఆనకట్ట ఇతర క్లిష్టమైన మౌలిక సదుపాయల ప్రాజెక్టుల వంటి ప్రదేశాల్లో పాటు, సీఐఎస్ఎఫ్ భద్రతా పరిధిలోని తీసుకువచ్చిన విభాగాల్లో నియమిస్తున్నట్లు చెప్పారు. విమానాశ్రయాల్లో భద్రత, స్క్రీనింగ్, ప్రయాణికుల నిర్వహణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. విమానాశ్రయాల్లో మహిళా సిబ్బందికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఇస్తున్నట్లు తెలిపారు. సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు తదితరులున్నారు.



పోస్టింగ్స్ తీసుకున్న సీఐఎస్ఎఫ్ కానిస్టేబుళ్లు, జీడీలు

రైతుల సంక్షేమానికి పెద్దపీట



పాలకవర్గంతో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి

కందుకూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని, మొక్కజొన్న రైతులకు కనీస మద్దతు ధర కల్పించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, నాలుగేళ్ల అనంతరం మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పీఏసీఎస్ చైర్మన్ ఎస్.వెంకట్‌రాంరెడ్డి తెలిపారు. బుధవారం పాలక వర్గం సభ్యులతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. డైరెక్టర్ కె.విష్ణువర్ధన్‌రెడ్డి, రైతులు నాగిరెడ్డి, శ్రీనివాస్‌నాయక్, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణంలో భాగస్వాములవ్వాలి

షాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆలయ నిర్మాణంలో దాతలు భాగస్వాములు కావాలని సీనియర్ జర్నలిస్టు అమీర్‌పేట్ గోవర్ధన్‌రెడ్డి కోరారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామ శివారులో శివాలయం పునర్నిర్మాణం సందర్భంగా తన వంతుగా గోవర్ధన్‌రెడ్డి రూ.లక్ష విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. మాజీ ఎంపీపీ కూర వెంకటయ్య, వివిధ గ్రామాల గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

చౌదరిగూడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా చేపట్టాలని, లబ్ధిదారులు ఆధార్ సీడింగ్ నమోదు తప్పనిసరి సరి చూసుకోవాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి అర్హుల వివరాలను పక్కాగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. నర్సరీల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీవో హన్మంత్‌రెడ్డి, ఏఈ శంకర్, ఉపాధి హామీ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నందిగామ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, శారీరక ధృడత్వంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని జడ్పీ వైస్‌చైర్మన్ ఈట గణేష్ అన్నారు. మండల కేంద్రంలో కొన్ని రోజులుగా యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న గురువు సోమ శ్రీనివాస్‌గుప్తాను యోగా శిక్షకులు బుధవారం సన్మానించారు. శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, సురేష్ గుప్తా, రాజు, సురేష్, మల్లేష్, రవి తదితరులు ఉన్నారు.



శ్రీనివాస్ గుప్తాను సన్మానిస్తున్న శిక్షకులు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

చౌదరిగూడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివరాణి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఇంద్రనగర్, చౌదరిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు, అమ్మాయిల చదువు, భద్రతపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ టీచర్లు గీత, పద్మ, ఉపాధ్యాయులున్నారు.

కడ్తాల్ : బాల్య వివాహాలను జరిపించినా, ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమని కడ్తాల్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత హెచ్చరించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, జెడ్పీహెచ్ఎస్‌లో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బాల్య వివాహాలు, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అదనపు ఎస్సై చంద్రశేఖర్, ఎస్‌వో అనిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు, టీచర్లు పాల్గొన్నారు.

మాడ్గుల : బాల్యవివాహాలను ప్రోత్సహించవద్దని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయమ్మ అన్నారు. మండలంలోని కోల్కులపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు బాల్యవివాహాలు, డ్రగ్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. హెచ్ఎం సువర్ణలక్ష్మి, కార్యదర్శి నవీన్, అంగన్‌వాడి టీచర్ సత్తమ్మ, వెంకటమ్మలు పాల్గొన్నారు.



కొత్తూర్ : బాలికలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ దీప్తి

కొత్తూర్ : బాలికలు బాల్య వివాహాలకు దూరంగా ఉండి, విద్యలో రాణించాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ దీప్తి సూచించారు. మల్లాపూర్‌తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. కన్హా శాంతివనంకు చెందిన దేవేంద్రప్రజాపతి, మృదుల్‌గార్గ్, అనురాధ, హైమవతి, శ్రీనివాసులు ధ్యానంపై బాలికలకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి, ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, కార్యదర్శి గీత, నాట్కో ట్రస్టు సూపర్‌వైజర్ శిరీష, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, నారాయణమ్మ, కమల, నాట్కో వాలంటరీ సునీత తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : ఆడపిల్లలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలుపాలని ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు. కొత్తపేట జెడ్పీహెచ్ఎస్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ పడావో, బేటీ బచావో కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శమంతకమణి, షీ టీమ్ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కేశంపేట మండల కేంద్రంలోని ఆదర్శ విద్యాలయంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దివ్యాసింగ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు మమత, లక్ష్మి, అమృతలు పాల్గొన్నారు.



కేశంపేట : విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్, సూపర్‌వైజర్ శమంతకమణి

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

శంకర్‌పల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): యువత ఆలోచనలు అదుపులో పెట్టుకుని మాదకద్రవ్యాలకు, వ్యసనాలకు దూరంగా ఉండాలని శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన వక్త కళ్యాణ్‌కుమార్ తెలిపారు. బుధవారం శంకర్‌పల్లి మండల కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో స్త్రీశక్తి దివస్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఏబీవీపీ నాయకులు సూర్యప్రకాశ్, పవన్ కళ్యాణ్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ఝాన్సీరాణిని ఆదర్శంగా తీసుకోవాలి

చేవెళ్ల : ఝాన్సీ లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలని, ఆమె అడుగుజాడల్లో నడిచే అమ్మాయిలే నేటి నిజమైన శక్తి అని రాష్ట్ర ఏబీవీపీ కార్యవర్గ సభ్యుడు కుర్వ మహిపాల్ తెలిపారు. బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో స్త్రీ శక్తి దివస్ కార్యక్రమంలో భాగంగా కృష్ణవేణి పాఠశాలలో ఝాన్సీ రాణి చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. ఏబీవీపీ నాయకులు హారిక, అనిల్, హరికృష్ణ, మణిదీప్, శివ, టీచర్లు, విద్యార్థులున్నారు.



ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు

హక్కుల సాధనకు బీసీలంతా ఏకమవుదాం



దీక్షలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు

షాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధనకు బీసీలందరం ఏకమవుదామని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు అన్నారు. షాబాద్‌లో బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరహార దీక్ష బుధవారంతో 39వ రోజుకు చేరింది. షాబాద్ మండల రిటైర్డ్ ఉద్యోగులు వీరస్వామి, చేవెళ్ల స్వామి, యాదగిరిచారి, వెంకటేష్‌గౌడ్, వెంకటయ్య, యాదయ్యలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించి, ఉద్యోగ, ఉపాధి, రాజకీయాల్లో స్థానం కల్పించాలని అన్నారు. రిలే దీక్షలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు రవీందర్, రమేష్‌యాదవ్, నర్సింహులు, చంద్రయ్య, రాము, రమేష్, చెన్నయ్య, గోపాల్, మల్లయ్య, శ్రీను, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ

కేశంపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మాజీ జడ్పీటీసీ పల్లె నర్సింగ్‌రావు తన జన్మదినాన్ని పురస్కరించుకుని అయ్యప్ప మాలదారణ భక్తులకు బుధవారం అన్నదానం చేశారు. దవళగిరి వెంకటేశ్వర స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామికి పల్లె నర్సింగ్ రావు-గిరిజ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వాములు తిరమలయ్య గౌడ్, రమణా రెడ్డి, శ్రీకాంత్ రెడ్డిలు మాజీ జడ్పీటీసీ దంపతులను శాలువాతో సత్కరించారు. అనంతరం అయ్యప్ప మాలధారణ భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. రమేష్ స్వామి, యుగందర్ స్వామి, గోపాల్‌స్వామి, మహేష్, రొల్ల మనోహర్, నక్క మహేందర్, పవన్ కుమార్ రెడ్డి, చందు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పారదర్శక పాలన



చెక్కు అందజేస్తున్న చర్ల వెంకట్ రెడ్డి

తలకొండపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తుందని ఏఎంసీ డైరెక్టర్ చర్ల వెంకట్‌రెడ్డి అన్నారు. వెల్జాల గ్రామానికి చెందిన ఫహీమా బేగంకు రూ.52 వేలు, గోవర్దన్ గౌడ్‌కు రూ.52 వేలు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరయ్యాయి. బుధవారం గ్రామంలో లబ్ధిదారులకు వెంకట్‌రెడ్డి చెక్కులు అందజేశారు. అంజయ్యగౌడ్, అజీజ్, నర్సింహులు, అంజిరెడ్డి, మోహన్‌రెడ్డి, రాజు, అజయ్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

తలకొండపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న బాల్యమిత్రుడి కుటుంబానికి స్నేహితులు బాసటగా నిలిచారు. గట్టిప్పలపల్లికి చెందిన మహ్మద్ ఇబ్రహీం ఈనెల 16న ఆకస్మికంగా మృతిచెందాడు. 2000-01 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన బాల్యమిత్రులు విషయం తెలుసుకొని బుధవారం అతడి కుటుంబాన్ని పరామర్శించారు. తలా కొంత పోగుచేసుకొని రూ.53 వేలు కుటుంబానికి ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. పిల్లల చదువులకు సాయమందిస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

రాజశేఖర్ కుటుంబాన్ని ఆదుకోవాలి



బాధితులతో మాట్లాడుతున్న నాయకులు

షాద్‌నగర్ రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కులోన్మాద హత్యకు గురైన రాజశేఖర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌రాములు డిమాండ్ చేశారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎల్లంపల్లికి బుధవారం వెళ్లిన నాయకులు రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. మృతుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగమివ్వాలని, శాసన సభలో చర్చించి కులాంతర రక్షణ చట్టం తేవాలన్నారు. మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంజయ్య, జగన్, శ్రీను నాయక్, రాజు, సాయిబాబా, నర్సింలు తదితరులు ఉన్నారు.